క్లుప్తంగా

పేద బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పేద బ్రాహ్మణుల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ శర్వాణీ మూర్తితో కలిసి క్రెడిట్ సొసైటీ రుణమేళా బ్రోచర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యాన సత్యనారాయణపురంలోని గాయత్రీ కల్యాణ మండపం ఆవరణలో ఈనెల 10వ తేదీన జరగనున్న రుణమేళాను నిరుపేద బ్రాహ్మణులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. సొసైటీ సీనియర్ బ్రాంచి మేనేజర్ జి.శ్రీనివాస్, నాయకులు చల్లా సుధాకర్, శనగవరపు శ్రీనివాస్, లంకా బాబు, చాంద్ శర్మ, మద్దాలి ప్రకాష్, కోలవెన్ను కొండా పాల్గొన్నారు.

పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించి, వారికి సరైన వైద్యం అందేలా వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంత వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులకు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా (డీఫార్మిటీ, డెఫిషియన్సీ, చైల్డ్‌హుడ్ డీసీజెస్, డిలే) వైకల్యం, లోపం, బాల్యవ్యాధులు, అలస్యం-4డీల సామర్థ్య పెంపు పునశ్చరణ శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అజిత్‌సింగ్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో 360 మంది వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ పిల్లలకు వచ్చే వ్యాధులు, లోపాలు సత్వరమే గుర్తించడం ద్వారా వారిని జిల్లా ఎర్లీ ఇంటర్వెన్షన్ కేంద్రానికి పంపించి చికిత్స అందించి ఆరోగ్యం మెరుగుపరచవచ్చునన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ మాధవి, రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ ప్రశాంత్, కుటుంబ డాక్టర్ కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ మోతీబాబు పాల్గొన్నారు.

రాత్రి 10 తర్వాతే ఈట్ స్ట్రీట్ ప్రారంభించాలి

పటమట(విజయవాడతూర్పు): ఇందిరాగాంధీ స్టేడియం వద్ద విజయవాడ నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన ఈట్ స్ట్రీట్‌ను రాత్రి 10 -12 గంటల వరకు మాత్రమే నిర్వహించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఎస్టేట్ అధికారి శ్రీనివాస్‌ను ఆదేశించారు. మంగళవారం రాత్రి ఆయన ఈ ప్రాంతాన్ని సందర్శించి ఈట్ స్ట్రీట్‌లో స్టాల్స్ కేటాయించిన వారంతా సాయంత్రం 6 గంటలకే స్టాల్స్ ఏర్పాటు చేసి వ్యాపారాలు నిర్వహించటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని పలు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. 10 గంటలకు ముందు ఎవరైనా స్టాల్స్ పెట్టి వ్యాపారాలు నిర్వహిస్తే జరిమానా విధించాలని ఆదేశించారు. ప్రతి స్టాల్ వద్ద విధిగా డస్ట్ బిన్స్ ఏర్పాటు చేసుకొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

నేడు, రేపు కృష్ణాష్టమి వేడుకలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాణిగారి తోట, 18వ డివిజన్‌లో వారధి వెంబడి మలేరియా కార్యాలయం ఆవరణలోని శ్రీ కృష్ణుని విగ్రహం వద్ద బుధవారం, గురువారం రెండు రోజుల పాటు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్ వెంకట సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణాష్టమి సందర్భంగా బుధవారం శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. గురువారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 5 గంటలకు ఉట్టి కొట్టే కార్యక్రమం జరుగుతుందన్నారు. వేడుకల్లో ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు పాల్గొంటారని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కోరారు.

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లోని పలు పెట్రోల్ బంకుల్లో పౌర సరఫరాల శాఖాధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పౌరసరఫరాల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ కుమారి పర్యవేక్షణలో సిబ్బంది పెట్రోలు నాణ్యత, ఇతర అంశాలపై క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. పెట్రోల్ బంకులు యజమానులు నిబంధనలు అనుసరించాలని, నాణ్యత, ప్రమాణాలు పాటించాలని ఆమె సూచించారు. తనిఖీల్లో ఏఎస్ఓ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు, వీధి దీపాల ఏర్పాటు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 32వ డివిజన్ 230 వార్డు సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఇచ్చిన హామీ మేరకు మంగళవారం విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ చీకటిగా ఉండటంతో ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికులు ఎమ్మెల్యే విష్ణు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎమ్మెల్యే విష్ణు అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం కొత్త విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు ఏర్పాటు చేశారు. స్థానికులు ఎమ్మెల్యే విష్ణుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్ పాల్, ఎలక్ట్రికల్ ఏఈ పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఉన్నతమైనది

- ఘనంగా టీచర్స్ డే వేడుకలు
- ఉపాధ్యాయులకు సత్కారం



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ తదితరులు



సత్కారం పొందిన ఉపాధ్యాయులతో గౌతంరెడ్డి, ట్రస్ట్ సభ్యులు

పాయకాపురం(విజయవాడరూరల్): సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉన్నతమైనదని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. రాజీవ్‌నగర్‌ని రాజీవ్‌గాంధీ నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. తొలుత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఉపాధ్యాయులందరికీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతిగా ఎన్నికైన సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నవ సమాజ నిర్మాణానికి గురువులే వారధులని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో వారి కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. అటువంటి గురువులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యా రంగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని, నాణ్యమైన విద్యను అందిస్తూ రేపటి తరాన్ని తీర్చిదిద్దడంలో ముందంజలో ఉందని చెప్పారు. నాడు-నేడు, ఇంగ్లిష్ మీడియం, విద్యాకానుక, అమ్మ ఒడి, గోరుముద్ద లాంటి కార్యక్రమాలతో విద్యారంగంలో ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చరిత్ర సృష్టించిందన్నారు. పేదల చదువు కోసం నాలుగేళ్లలో రూ.65 వేల కోట్లు ఖర్చు చేసిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా ఉపాధ్యాయులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరిసా శ్రీనివాసరావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి.జమల పూర్ణమ్మ సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడిగా, భారత రాష్ట్రపతిగా అందించిన సేవలను కొనియాడారు. సమాజానికి దిశానిర్దేశం చేసి జ్ఞానాన్ని పంచే ఉపాధ్యాయులను గౌరవించుకోవడం గొప్ప సంస్కృతి అన్నారు. అనంతరం విద్యార్థులు చైర్ పర్సన్ జమల పూర్ణమ్మ, గ్రంథాలయ సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, సిబ్బంది వై.ధనలక్ష్మి, కె.రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీసీఎల్ అండ్ టీపీ ఆధ్వర్యంలో..

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): పేదలకూ నాణ్యమైన విద్యను అందించడానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు చెప్పారు.మంగళవారం రాత్రి మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ (వీసీఎస్ అండ్‌టీఏ) ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి ఎమ్మెల్యే వెలంపల్లి, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ముఖ్య అతిథులుగా హాజరై సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెలంపల్లి, అవినాష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అన్ని సౌకర్యాలను నాడు-నేడు పథకం ద్వారా అందిస్తున్నామని చెప్పారు. వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. సభ అనంతరం రాయల్ హైస్కూల్ అధినేత ఆజాద్, సిద్ధార్థ క్రియేటివ్ స్కూల్ అధినేత వాసా ఆదినారాయణ దంపతులను అతిథులు సత్కరించారు. వీసీఎస్ అండ్ టీఏ అధ్యక్షురాలు వెనిగళ్ల అమ్మాజీ, కార్పొరేటర్ వై.చలపతిరావు, వీసీఎస్ అండ్ టీఏ గౌరవాధ్యక్షుడు దేవినేని కిషోర్ కుమార్, అసోసియేషన్ సభ్యులు సాంబశివరావు, షేక్ షరీఫున్నీసా, అనుమోటి చెన్నయ్య, బాడిష ఉషారాణి, సాయి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

గురువుని మించిన దైవం లేదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): గురువుని మించిన దైవం లేదని, భావి సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర ఎనలేనిదని కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి అన్నారు. స్థానిక దుర్గాపురంలో మంగళవారం సాయంత్రం బీఆర్‌టీఎస్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన టీచర్స్ డే వేడుకలు జరిగాయి. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు గుర్రం ఏడు కొండలు, కోశాధికారి బ్రహ్మదేశం వసంతకుమార్ మాట్లాడారు. అనంతరం సిద్ధార్థ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ జయలక్ష్మిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆర్ రామకృష్ణప్రసాద్, క్లబ్ ప్రధాన కార్యదర్శి కొండాయగుంట రాము, సభ్యులు సీతారామయ్య, పోతుల విల్సన్ రాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు. సత్యనారాయణపురం శ్రీవిజ్ఞాన విహార పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాభారతి క్షేత్ర సంఘటన మంత్రి కన్నా భాస్కర రావు ముఖ్య అతిథిగా పాల్గొని గురువు ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ బీవీఎస్‌టీ సాయి, ప్రిన్సిపాల్ జేవీ షణత్‌కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అయోధ్యనగర్‌లో వాసవీ వారోత్సవాలు, టీచర్స్‌డే సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు వాసా హిమబిందు, వీ స్మిత, పద్మజ మాట్లాడుతూ గురువులను సత్కరించుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు శ్రీనివాసరావు తదితరులను క్లబ్ సభ్యులు సత్కరించారు.

సెయింట్ జాన్స్ స్కూల్‌లో

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సెయింట్ జాన్స్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విద్యా సంస్థల డైరెక్టర్ దీపిక పాల్గొని మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యాసంస్థల సెక్రటరీ టి.సుమన్ త్యాగరాజ్, చైర్మన్ మోనికా, డీన్స్ కళ్యాణి, ప్రిన్సిపాల్ లక్ష్మీ కౌసల్య పాల్గొన్నారు.

చిత్తరంజన్ గ్రంథాలయంలో...

స్థానిక సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి పి.సంపత్‌కుమార్ సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురువులను గౌరవించటం సామాజిక బాధ్యత

మధురానగర్(విజయవాడసెంట్రల్): సమాజంలో గురువు స్థానం కీలకమని గురువులను గౌరవించటం సామాజిక బాధ్యత అని సాయిబాబా మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. స్థానిక ముత్యాలంపాడు శ్రీ షిరిడీ సాయి బాబా మందిరంలో మంగళవారం మందిర కమిటీ, పూనూరు సుబ్బరామిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యాన ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నగరపాలకసంస్థ పాఠశాలలకు చెందిన 30 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. ఇక నుంచి ప్రతీ ఏటా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించటంతో పాటు నగదు పురస్కారం అందజేస్తామని తెలిపారు. అనంతరం బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి బాబావారి శేషవస్త్రం తీర్థప్రసాదాలతో ఉపాధ్యాయులను సత్కరించారు. మందిర కమిటీ కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, పీ మల్లయ్య, యాదల శ్రీనివాసరావు, కమ్మిలి రత్నకుమార్, విజయ్‌కుమార్, ట్రస్ట్ సభ్యులు దివ్యవాణి, జయరామ్‌రెడ్డి, నిర్మల్ రెడ్డి పాల్గొన్నారు.



సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జమల పూర్ణమ్మ తదితరులు



వాసవీ అభ్యుదయ కపుల్స్ ఆధ్వర్యంలో..

గురువుల పాత్ర కీలకం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సమాజంలో గురువుల పాత్ర అత్యంత కీలకమైనదని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని స్వామి వివేకానంద సెంటినరీ హైస్కూల్లో టీచర్స్ డే వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి డెప్యూటీ మేయర్ శ్రీశైలజ ముఖ్య అతిథిగా హాజరై గురువులను ఘనంగా సన్మానించారు.



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, అవినాష్, నిర్వాహకులు



దుర్గాపురంలో బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం



సెయింట్ జాన్స్ స్కూల్‌లో..

రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు

- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్రంలో అన్ని వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 63వ డివిజన్ 279వ వార్డు సచివాలయ పరిధిలో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఎల్ఐజీ కాలనీలో విస్తృతంగా పర్యటించి, 180 గడపలను సందర్శించారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడుతూ వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. గత చంద్రబాబు ప్రభుత్వం శివారు ప్రజల సమస్యలను పూర్తిగా గాలికొదిలేసిందని విష్ణు అన్నారు. సంక్షేమ పథకాలు పేదలకు శ్రీరామరక్ష అని చెప్పారు.

తేలు కుట్టిన దొంగల్లా బాబు, లోకేష్..

జగనన్న సురక్ష స్ఫూర్తి ఇప్పటికీ కొనసాగుతుందని ఎమ్మెల్యే విష్ణు అన్నారు. ఈ నెలలో వైఎస్సార్ చేయూత నాలుగో విడత నిధులను ప్రభుత్వం విడుదల చేయనున్న నేపథ్యంలో పథకంపై విస్తృత అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. పలువురికి ఎమ్మెల్యే సర్టిఫికెట్లు అందజేశారు. వారికి పథకాలు అందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్ర చరిత్రలో ఒక సంక్షేమ క్యాలెండర్‌ను విడుదల చేసి, చెప్పిన తేదీకి లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నగదును జమ చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. ఐటీ నోటీసులపై తేలుకుట్టిన దొంగల్లా చంద్రబాబు, నారా లోకేష్ ఎందుకు నోరు మెదపడం లేదని ఎమ్మెల్యే విష్ణు ప్రశ్నించారు. పొద్దున లెగిస్తే పచ్చమీడియా ముందు ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చే బాబు అండ్ కో, గత నాలుగు రోజులుగా ఎందుకు సైలెంట్ అయ్యారో సమాధానం చెప్పాలన్నారు. రాజధాని పేరుతో చంద్రబాబు చేసిన అక్రమాలు, దోపిడీ అంతా ఇంతా కాదని, బాబు బండారం అంతా ఒక్కసారిగా బయటపడిందని పేర్కొన్నారు. అమరావతి కాంట్రాక్టులకు సంబంధించి లంచాల రూపంలో రూ. 118 కోట్లు చంద్రబాబు తీసుకున్నారని, అందులో నారా లోకేష్‌కు, అత్యంత సన్నిహితుల పేర్లు ఉన్నట్లు ఇన్‌కం ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ స్పష్టం చేసిందన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై జాతీయ మీడియాలో కథనాలు వచ్చినా, చంద్రబాబు, నారా లోకేష్, ఎందుకు ఖండించడం లేదన్నారు. ఇప్పటికైనా బాబు అండ్ కో నోరు విప్పాలని, లేకుంటే తప్పును ఒప్పుకున్నట్లుగానే భావిస్తామన్నారు. కార్యక్రమంలో సీడీఓ జగదీశ్వరి, నాయకులు పసుపులేటి యేసు, మోదుగుల గణేష్, సీహెచ్.రవి, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు

మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యాలు పూర్తిగా దెబ్బతింటాయని, సమాజంలో పెరుగుతున్న మాదక ద్రవ్యాలను నియంత్రణకు ఆశా, ఆరోగ్య కార్యకర్తలు తమవంతు సహకారం అందించాలని నవజీవన్ బాలభవన్ నీతోడు మానసిక వికాస కేంద్రం సైకాలజిస్ట్ జి.అనూష అన్నారు.

యువతపై శ్రద్ధ వహించాలి..

నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్‌లోని ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు మాదక ద్రవ్యాలు-సోషల్ మీడియా దుర్వినియోగంపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాల వలన విద్యార్థుల జీవితాన్ని నిలువెల్లా నాశనం చేస్తోందని, సరదాగా అలవాటు చేసుకొని చివరకు మత్తు పదార్థాలు లేకుండా ఉండలేని పరిస్థితికి దిగజారుతున్నారని తెలిపారు. ఆశా, ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామ వార్డ్ వలంటీర్, మహిళా పోలీసుల సహకారంతో తమ తమ పరిధిలోని ప్రతి కుటుంబంలోని యువతను గమనించాలని సూచించారు. వివరాలకు 94904 92020 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ ఆఫీసర్ రాణి, నవజీవన్ బాల భవన్ జోనల్ కో ఆర్డినేటర్ వసంత కుమారి, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సృజనాత్మకత పోటీలు

పటమట(విజయవాడతూర్పు): స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రజలందరూ సహకరించాలని వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి కోరారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నాలుగో అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి, నీలి ఆకాశం దినోత్సవం సందర్భంగా నగరంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు మంగళవారం డ్రాయింగ్ పోటీలు, సైన్స్ ఫెయిర్, సృజనాత్మకత పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన అనంతరం ఏసీ మాట్లాడుతూ.. బాల్యం నుంచే ప్రకృతి, పర్యావరణంపై అవగాహన కల్పించాలన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నిరోధించేందుకు విద్యార్థుల్లో కాలుష్యాన్ని తగ్గించే సృజనాత్మకమైన ఆలోచనలను రేకెత్తించాలని చెప్పారు. వాయు కాలుష్యం ప్రభావం అనే అంశంపై మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అనంతరం ఆయా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



విద్యార్థుల ప్రయోగాలను తిలకిస్తున్న వీఎంసీ అదనపు కమిషనర్ సత్యవతి

8 నుంచి తిరుపతిలో పీడీఎస్‌యూ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక తరగతులు


అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక తరగతులు తిరుపతి నగరంలో సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఐ.రాజేష్ తెలిపారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్లను సింగ్‌నగర్‌లోని శ్రీవిద్యా జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 8న పీడీఎస్‌యూ వ్యవస్థాపకుడు జార్జి రెడ్డి స్వగ్రామం చల్లావారి పల్లె నుంచి బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి జార్జిరెడ్డి సినిమా హీరో సందీప్, దర్శకులు జీవన్ రెడ్డి హాజరవుతారన్నారు. విద్యార్థులంతా ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మధురం.. వాగ్గేయకార సంకీర్తనం

విజయవాడకల్చరల్: ప్రముఖ వయోలిన్ విద్వాంసురాలు గద్దే వెంకట రామకుమారి జయంతి సందర్భంగా స్వరఝరి సంగీత సంస్థ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో మంగళవారం నిర్వహించిన అంబటిపూడి కామాక్షి వయోలిన్ సోలో కచేరీ మధురంగా సాగింది. సంగీత మూర్తిత్రయం త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్ శ్యామ శాస్త్రి, రచించిన కీర్తనలను వయోలిన్‌పై మధురంగా పలికించారు. కుందుర్తి అరవింద్ మృదంగంపై, ఎం.హరిబాబు ఘటంపై సహకరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ.. రామకుమారి సుదీర్ఘకాలం సంగీత కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేశారన్నారు.అంజనా సుధాకర్, పారుపల్లి సుబ్బరాయఫల్గుణ్ తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూ విద్యార్థికి జపాన్ ఐటీ కంపెనీలో ఉద్యోగం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కేఎల్‌యూ డీమ్డ్ యూనివర్సిటీలో ఈసీఈ చదువుతున్న ముల్లా అబ్దుల్ ఖాదిర్ అనే విద్యార్థి అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగం సాధించినట్లు యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సారధివర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ ఉద్యోగాల కల్పనలో భాగంగా క్యాడ్ వంటి ప్రముఖ సాఫ్ట్‌వేర్‌లను అభివృద్ధి పరిచే సిస్టమ్ మ్యాట్రిక్స్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీలో రూ.26 లక్షల వార్షిక జీతంతో పాటు వసతి, ప్రయాణ ఖర్చులు వంటి పలు రకాల అలవెన్సులను కంపెనీ కల్పిస్తుందన్నారు. విజయవాడకు చెందిన ముల్లా అబ్దుల్ ఖాదిర్ తల్లిదండ్రుల సొంతూరు విజయవాడ అయినప్పటికీ ప్రస్తుతం వారు విదేశాలలో ఉంటున్నారని తెలిపారు. భాషా సమస్య లేకుండా ఉండటం కోసం వర్సిటీలో ఉన్న విదేశీ భాషల విభాగం ఆధ్వర్యంలో విద్యార్థి ఖాదిర్‌కు జపాన్ భాషపై ప్రత్యేక శిక్షణనిస్తున్నట్లు తెలిపారు.



ముల్లా అబ్దుల్ ఖాదిర్

తెలుగు వారి గుండెచప్పుడు ఘంటసాల

విజయవాడకల్చరల్: తెలుగు వారి గుండెచప్పుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అని శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమా సత్యనారాయణ అన్నారు. సంగీత కళాకారుడు పప్పు సదాశివశాస్త్రి ఆధ్వర్యంలో సినీ సంగీత దర్శకులు, గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ఏసుదాసుల స్ఫూర్తి కార్యక్రమం సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. పప్పు సదాశివ శాస్త్రి, గుడిపాటి జయరాం ప్రసాద్, మల్లాది స్వాతి తదితరులు ఘంటసాల, బాలు, జేసుదాసు గానం చేసిన గీతాలను ఆలపించారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని కార్పొరేటర్ పెనుమత్స శిరీష అన్నారు. స్థానిక 31వ డివిజన్‌లో నూతనంగా మంజూరైన పింఛన్‌లను మంగళవారం వార్డు సచివాలయం సిబ్బంది వలంటీర్లతో కలిసి ఆమె అందజేశారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం, అడ్మిన్ స్వాతి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సందడిగా కృష్ణాష్టమి వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మన సంస్కృతీ సంప్రదాయాలకు పండుగలు ప్రతీక అని ప్రముఖ వైద్యులు డాక్టర్ టి.లక్ష్మీకుమారి అన్నారు. స్థానిక సత్యనారాయణపురం శ్రీ విజ్ఞాన విహార పాఠశాలలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని చిన్నారులకు శ్రీకృష్ణ, రాధ వేషధారణ పోటీలు జరిగాయి. చిన్నారులు తమ వేషధారణలతో చేసిన విన్యాసాలు ఆహుతులను అలరించాయి. పాఠశాల కరస్పాండెంట్ బీవీఎస్‌టీ సాయి, ప్రిన్సిపాల్ జేవీ షణత్ కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో చిన్నారులు

రౌడీషీటర్లు తీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు

పటమట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా పటమట, కృష్ణాజిల్లా పెనమలూరు పోలీస్‌స్టేషన్ల సరిహద్దు ప్రాంతాల్లో ప్రజలను వేధింపులకు గురిచేస్తున్న రౌడీషీటర్లు తీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని సిటీ పోలీస్ కమిషనర్ టీకే రాణా హెచ్చరించారు. పటమట ప్రాంతంలో కొంతమంది యువకులు కలిసి రోడ్డుపై మద్యం సేవించి ఘర్షణ పడుతున్నారని స్థానికులు సమాచారం ఇవ్వటంతో సంఘటన స్థలంలో ఉన్న పోలీసులు రౌడీషీటర్ పండు, రెహమాన్, కోనేరు రాజా, కవి ప్రవీణ్ వారి అనుచరులను అదుపులోకి తీసుకున్నారు. అసాంఘిక పనులకు పాల్పడినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవని సీపీ వారిని హెచ్చరించారు.

ఆటోడ్రైవర్‌పై దాడి.. కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): పాత గొడవల నేపథ్యంలో ఆటో డ్రైవర్‌ను గాయపర్చిన వారిపై నున్న పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం న్యూరాజీవ్ నగర్‌కు చెందిన ఎలగందు ఉదయ్‌కుమార్(29) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఈ నెల 4న రాత్రి 10 గంటల సమయంలో ప్రకాష్‌నగర్‌లోని దుర్గాబార్ వైపు నుండి నడుచుకుంటూ వస్తుండగా కూదేటి గణేష్, ఎస్‌కె.జావీద్‌లు పాత గొడవల నేపథ్యంలో ఉదయ్‌కుమార్‌పై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.